క్లుప్తంగా

ప్రజల సహకారంతోనే గ్రామాల్లో పరిశుభ్రత



మాకవరపాలెంలో చెత్తను తొలగిస్తున్న ప్రత్యేక అధికారి, తదితరులు

మాకవరపాలెం : గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యతని మండల ప్రత్యేక అధికారి మనోరమ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో చెత్త తొలగింపు పనుల్లో ఆమె పాల్గొన్నారు. ఆమెతో పాటు అధికారులు శ్రమదానంతో చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సహకారంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతా మహాలక్ష్మి, కార్యదర్శి బాలదొర, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

షిర్డీసాయి ఆలయానికి రూ.25 వేల విరాళం



ఎం.కోడూరు షిర్డీ సాయి ఆలయానికి విరాళం అందజేస్తున్న శ్రీనాధు శ్రీనివాసరావు

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న శ్రీ షిర్డీసాయి ఆలయానికి మాడుగుల మాజీ ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు రూ.25వేలు విరాళం అందజేశారు. ఎం.కోడూరు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడుకు గురువారం ఈ విరాళం అందించారు. ఈ ఆలయానికి స్థలాన్ని పడాల వారి వీధిలో, పడాల బ్రదర్స్ ఉచితంగా అందజేశారు. ఆలయానికి సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిన రమణబాబు, మాజీ సర్పంచ్ పడాల చిట్టిబాబు, పడాల శ్రీనివాసరావు సహకారం అందిస్తున్నారని అప్పలనాయుడు తెలిపారు. భారీ విరాళం అందజేసిన శ్రీనివాసరావుకు ఆలయ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దచెరువు ఆక్రమణలపై సర్వే



కాలువను సర్వే చేస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

నర్సీపట్నం : పెద్దచెరువు ప్రధాన కాలువ ఆక్రమణలపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా గురువారం సర్వే ప్రారంభించారు. ఇరిగేషన్ ఏఈ రామన్నపాత్రుడు ఆధ్వర్యంలో సర్వేయర్ వెంకటేశ్వరరావు సర్వే చేపట్టారు. నర్సీపట్నం పెద్ద చెరువులు పొర్లు కట్టు మొదలుకొని శారదానగర్, ధర్మసాగరం వరకు ప్రధాన కాలువ విస్తీర్ణం ఎంత అనేది నిర్ధారించేందుకు సర్వే చేపట్టిన ఏఈ తెలిపారు. సర్వే పూర్తి చేసి ఆక్రమణలు ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నూతన తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్ వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు రాజకీయ నాయకులు

నాతవరం : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ ఎ.వేణుగోపాల్‌ను గురువారం ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఆయన తన కార్యాలయంలో సచివాలయ సర్వేయర్లు వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. తహసీల్దార్‌ను కలిసిన సత్కరించిన వారిలో మాజీ ఎంపీపీలు పారుపల్లి కొండబాబు నేతల విజయకుమార్, సింగంపల్లి సన్యాసిదేముడు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పాలకుల నిర్లక్ష్యం... రైతులకు శాపం

ప్రభుత్వం సాగునీటి కాలువల పూడికతీతకు నిధులు మంజూరు చేయకపోవడం, మరోవైపు అధికారుల నిర్లక్ష్యం తాండవ రైతుల పాలిట శాపంగా మారింది. తాండవ రిజర్వాయరులో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్నా పంట కాల్వలు మూసుకుపోవడంతో శివారు ఆయకట్టుకు నీరందడం లేదు. వర్షం పడితేనే శివారు ఆయకట్టు పంట పొలాలకు నీరు సరఫరా అవుతుంది.

- తాండవలో పుష్కలంగా నీరున్నా శివారు భూములకు అందని వైనం
- కాలువ పూడికతీత పనులకు నిధులివ్వని ప్రభుత్వం
- వరుణుడు కరుణిస్తేనే పంట చేతికొచ్చేది..



ప్రధాన గేట్ల వద్ద ప్రమాదస్థాయిలో నీటిమట్టం



పంటకాలువలో పూడిక కారణంగా నిలిచిపోయిన నీరు

నాతవరం : ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు కరుణించడంతో తాండవ రైతులకు ఇంతవరకు నీటి కష్టాలు లేకుండా సాగుతుంది. అయితే ఎండ తీవ్రత అధికంగా ఉంటే శివారు ఆయకట్టు వరి పొలాలకు నీరు అందడం కష్టంగా మారింది. తాండవ రిజర్వాయరు నీరు ఆధారంగా ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో రెండు జిల్లాల పరిధిలో 52,465 ఎకరాలు వరి పంట సాగు చేస్తుంటారు. సాధారణంగా ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తాండవ కాలువలో పూడికతీత పనులు చేపట్టాల్సి ఉంది. పూడికతీత పనులు చేస్తేనే శివారు ఆయకట్టుకు ప్రాజెక్టు నీరు అందుతుంది. కానీ ఈ ఏడాది ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో తాండవ కాలువలకు పూడికతీత పనులు చేయలేదు. ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీరు సరఫరా చేసేందుకు ప్రధాన కాలువలకు పిల్ల కాల్వలు కలుపుకొని మొత్తం 120 కిలోమీటర్ల పొడవునా రెండు జిల్లాల పరిధిలో ఉన్నాయి. ఆ కాలువలో పూడిక తీయకపోవడంతో నీటి ప్రవాహానికి అడ్డుగా తుప్పలు పెరిగిపోయాయి. ప్రస్తుతం తాండవ ప్రాజెక్టులో నీటి మట్టం 378 అడుగులు దాటి ప్రమాద స్థాయిలో ఉంది. ఆయకట్టు భూములకు ప్రధాన కాలువల ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కానీ పూడిక కారణంగా శివారు భూములకు నీరు ప్రవహించడం లేదు. నర్సీపట్నం మండలం బలిఘట్టం మేజరు శివారు భూములు, కోటవురట్ల మండలం పాములవాక చిన బొడ్డేపల్లి మేజరు శివారు భూములకు సాగునీరు అందడం లేదు. కాకినాడ జిల్లా కోటనందూరు మండలం బి.హెచ్.కోట ఇండుగబిల్లి మేజరు, కె.ఈ చిన్నయ్యపాలెం మేజరు శివారు ఆయకట్టుకు, రవతల పూడి మండలంలో శివారు భూములకు నీటి ప్రవాహం అంతంతమాత్రంగా ఉంది.

అధికారుల బదిలీతో మరింత సమస్య

ఇటీవల జరిగిన అధికారుల బదిలీల్లో భాగంగా తాండవ కాలువలపై పూర్తి అవగాహన ఉన్న నలుగురు జేఈలు శ్యామ్‌కుమార్, వినయకుమార్, రామకృష్ణ పాత్రుడు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. గతంలో తాండవ కాలువపై నీటి పర్యవేక్షణకు సుమారు 40 మంది పైగా లష్కర్లు ఉండేవారు. అందులో 90 శాతం లష్కర్లు పదవీ విరమణ చేశారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించలేదు. దీంతో ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు వరుణుడు కరుణిస్తేనే నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. దీనిపై తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధను వివరణ కోరగా శివారు ఆయకట్టు భూములకు నీరు ప్రవహించకపోవడం వాస్తవమేన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల ద్వారా పంట పొలాలకు నీరు అందించేందుకు దృష్టి సారించామన్నారు.



ప్రాజెక్టు వద్ద కాలువ పట్టకుండా ప్రవహిస్తున్న నీరు



తాండవ ప్రధాన కాలువలో నీటి ప్రవాహానికి అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలు, తుప్పలు

బూడికి లస్కర్, యూజీడీ సిబ్బంది కృతజ్ఞతలు



మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు చెబుతున్న లస్కర్, యూజీడీ సిబ్బంది

కె.కోటపాడు : ఎన్నో ఏళ్లుగా వేతనాల పెంపు కోసం ఎదురు చూసిన తమకు గత ప్రభుత్వ హయాంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు తీసుకున్న చర్యల కారణంగా వేతనాలు పెరిగినట్టు రైవాడ కెనాల్‌పై పనిచేస్తున్న లస్కర్, యూజీడీ సిబ్బంది తెలిపారు. తారువలో వారంతా బూడి ముత్యాలునాయుడును ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, గొర్రుపోటు ఆధ్వర్యంలో గురువారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తమకు రూ.15వేల వేతనాలు మాత్రమే అందేవని అన్నారు. వేతనాల సమస్యను అప్పట్లో బూడి ముత్యాలనాయుడు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన విశాఖపట్నం మేయర్ హరికుమారి దృష్టికి తీసుకువెళ్లి వేతనాల పెంపునకు కౌన్సిల్‌లో తీర్మానం ఆమోదం పొందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. అనంతరం ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకువెళ్లి వేతనాలు రూ.21వేల పెంచేలా చూశారని లస్కర్‌లుగా పని చేస్తున్న వేచలపు శ్రీరామ్మూర్తి, కె.జాజిబాబు, ఒమ్మి కోటి తదితరులు తెలిపారు. వేతనాల పెంపుతో రైవాడ కెనాల్‌పై పని చేస్తున్న 192 మంది లస్కర్, యూజీడీలకు మేలు కలిగిందన్నారు. ఇందుకు కృషి చేసిన బూడి ముత్యాలునాయుడుతో పాటు మేయర్ హరికుమారి, మాడుగుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర్లె అనురాధకు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనుల సమస్యలపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకన్న



కొండగెడ్డపై గిరిజనుల శ్రమదానంతో చేపట్టిన వంతెన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న వెంకన్న

మాడుగుల : గిరిజనుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోలేదని, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి. వెంకన్న అన్నారు. గురువారం తాటిపర్తి పంచాయతీ అజయపురం గ్రామంలో గిరిజన సమస్యలపై ఆయన మాట్లాడారు. తాటిపర్తి నుంచి అజయపురం మార్గంలో ఉధృతంగా ప్రవహించే కొండ గెడ్డ ఉంది. వర్షాకాలంలో ఈ గెడ్డ దాటలేని పరిస్థితి. ప్రతి ఏటా గిరిజనులు శ్రమదానంతో కర్రలతో చిన్న వంతెన నిర్మాణం చేసుకుంటారు. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కర్రలతో చిన్న వంతెన నిర్మాణం చేసుకుంటున్నారు. గెడ్డ ఉధృతి పెరిగితే ఈ కర్రల వంతెన కొట్టుకు పోతుంది. తాగునీరు సైతం కొండగెడ్డలపై ఆధారం పడి జీవిస్తున్నా ప్రభుత్వం వీరి కనీస అవసరాలను తీర్చేలా చర్యలు తీసుకోలేదని వెంకన్న అన్నారు. జిల్లా కలెక్టరు ఈ గ్రామాన్ని సందర్శించి గిరిజన సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఇరటా నరసింహమూర్తి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే హోటల్ సీజ్ చేస్తాం

- కమిషనర్ సురేంద్ర



హోటల్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ సురేంద్ర

నర్సీపట్నం: హోటల్ యజమానులు నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర హెచ్చరించారు. మున్సిపాలిటీలో పెద బొడ్డేపల్లి వంతెన వద్ద ఉన్న హోటల్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ మాంసం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో పాటు పని చేసే సిబ్బంది ప్రమాణాలు పాటించకపోవడాన్ని కమిషనర్ గుర్తించారు. తాజా మాంసాన్ని మాత్రమే వినియోగించాలని సూచించారు. హోటల్‌పై చర్యలకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబును ఆదేశించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీదేవి

నర్సీపట్నం : సాగులో సస్యరక్షణ పద్ధతులను పాటించి పంటలకు చీడపీడల నుంచి రక్షణ కల్పించుకోవాలని ఏడీఏ శ్రీదేవి రైతులకు సూచించారు. గురువారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి సబ్ డివిజన్‌లో పలుచోట్ల రైతులతో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను వివరించారు. అనంతరం గ్రామంలోని పంట పొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరి పంట పిలకదశ నుండి చిరుపొట్ట దశలో ఉన్నట్లు గమనించామన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల పాముపొడ తెగులు, ఆకుముడత పురుగు, పొటాషియం లోపం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించటం జరిగిందన్నారు. తొలిదశలోనే తెగుళ్ల నివారణకు పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలన్నారు. సుడోమోనాస్ ఫ్లోరిసెన్స్ మందు పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల ఈవోపీఆర్‌డీగా కరుణాకర్

మాడుగుల రూరల్ : మాడుగుల మండల పరిషత్ ఈవోపీఆర్‌డీగా కె.కరుణాకర్ గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోపీఆర్‌డీగా పనిచేసిన మీనాకుమారి పద్మనాభం మండలానికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఈవోపీఆర్‌డీ కరుణాకర్ మాట్లాడారు. ప్రతి శనివారం ఉదయం 6 నుంచి 10 గంటల వరకు శ్రమదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు

నాతవరం : మండలంలో మర్రిపాలెంలో గల కస్తూరిభా పాఠశాలలో పని చేసేందుకు బోధనేతర సిబ్బంది నియమకాల కోసం దరఖాస్తులు చేసుకోవచ్చునని ఎంఈవో -2 కామిరెడ్డి వరహాలబాబు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మర్రిపాలెం కేజీబీవీ పాఠశాలలో నైట్ వాచ్‌మన్‌గా పని చేసేందుకు ఆసక్తి గల మహిళలు ఈనెల 15వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు వయో పరిమితి సడలింపు ఉందన్నారు.

నర్సీపట్నం తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు

మాకవరపాలెం : నర్సీపట్నం తహసీల్దార్ రామారావుకు మాకవరపాలెం తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన ప్రసాద్‌కు అరకు బదిలీ అయింది. ఈయన స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో రెవెన్యూ పనులు నిలిచిపోకుండా ఉండేందుకు నర్సీపట్నం తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించడంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వైన్‌షాపులకు 383 దరఖాస్తులు

చోడవరం రూరల్ : చోడవరం ఎక్సైజు పరిధిలో గల 22 మద్యం దుకాణాలకు 383 దరఖాస్తులు వచ్చినట్టు ప్రొహిబిషన్ ఎక్సైజు చోడవరం స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె.వి.పాపునాయుడు తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి శుక్రవారం ఆఖరి రోజు కావడంతో ఆసక్తి గలవారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసేకోవాలని కోరారు. మండలాల వారీగా అందిన దరఖాస్తు వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలంలో 8 దుకాణాలకు 120, బుచ్చియ్యపేట మండలంలో అయిదు దుకాణాలకు 87, కోటపాడు మండలం ఐదు దుకాణాలకు 92, దేవరాపల్లి మండలంలో నాలుగు మద్యం షాపులకు 84, దరఖాస్తులు గురువారం సాయంత్రం నాటికి అందాయన్నారు. ఆఖరి తేదీ 11(శుక్రవారం) సాయంత్రం 07 గంటల లోపు ఆసక్తి గలవారు అన్ని నిబంధనలకు లోబడి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మండల సర్వేయరుగా ప్రసాద్

నాతవరం : మండల సర్వేయరుగా డి.వి.ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన అధికారుల బదిలీలో భాగంగా గతంలో ఇక్కడ పని చేసిన బాల్‌రెడ్డి శ్రీకాకుళం జిల్లాకు వెళ్లిపోయారు. ఆయన స్థానంలో నర్సీపట్నం మండలం తహసీల్దార్‌గా పని చేస్తున్న ప్రసాద్‌ను ఇక్కడ నియమించడంతో ఆయన విధుల్లోకి చేరారు.

అన్న సమారాధనలు



నాతవరం ఆలయం వద్ద అన్నసమారాధన

కె.కోటపాడు/నాతవరం : దుర్గాష్టమి సందర్భంగా గురువారం గవరపాలెం, కొరువాడ గ్రామాల్లో దుర్గాదేవి మండపాల వద్ద గురువారం అన్నసమారాధనలను నిర్వహించారు. అలాగే నాతవరం రాజుపేట అగ్రహారం పీకేగూడెం గ్రామాల్లో అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. తాండవ కాలువ గట్టున వేంచేసిన శ్రీదుర్గాదేవి ఆలయం వద్ద సుమారుగా 6 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

అంబరాన్నంటిన దుర్గాష్టమి సంబరం

- వైభవంగా తిరువీధి, తెప్పోత్సవాలు
- భారీగా అన్న సమారాధనలు



నర్సీపట్నం దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో..



వంటర్లపాలెం కనక దుర్గమ్మ ఆలయంలో..



సీతయ్యపేటలో దుర్గమ్మను దర్శించుకున్న మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



బోయిలకింతాడలో దుర్గాదేవిని దర్శించుకున్న బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు



దుర్గావతారంలో మాడుగుల దేవీతల్లి



కె.జె.పురంలో దుర్గాలమ్మకు పూజలు



బుచ్చెయ్యపేట : సీతయ్యపేట దుర్గామల్లేశ్వర్ల అమ్మవారి దుర్గాష్టమి సంబరం అంబరాన్నంటింది. అమ్మవారి సంబరానికి లక్షలాది మంది తరలివచ్చారు. గురువారం దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. సత్యనారాయణ వ్రతం, చండీ హోమం, దుర్గాష్టమి పూజ, అమ్మవారి తిరువీధి ఉత్సవం, అగ్నిగుండం తొక్కుట, తెప్పోత్సవం, క్షీరాభిషేకం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద పదివేల మందికి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, సన్నాయి మేళాలు, డప్పులు, వాయిద్యాలు, నేలడాన్స్‌లు, తప్పెటగుళ్లు, బాజాభజంత్రీలు, బాణసంచా వెలుగులతో అమ్మవారి సంబరం సాగింది. వేలాది మంది భవానీ భక్తులతో పాటు ప్రజలు తిరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు. కొందరు భక్తులు ఒంటికి శూలాలు గుచ్చుకోగా మరికొంత మంది అమ్మవారి అగ్నిగుండం తొక్కి అమ్మవారిపై ఉన్న భక్తిని చాటుకున్నారు. రాత్రికోనేరులో అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోకివాడ రాము భవానీ ఆధ్వర్యంలో అమ్మవారి తిరువీధి ఉత్సవం సాగగా ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్న పలువురు రాజకీయ నాయకులు, అధికారులు అమ్మవారిని దర్శించుకుని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు.

నర్సీపట్నం: దుర్గాష్టమి సందర్భంగా గురువారం పట్టణంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. కుంకుమార్చన హారతి ఇచ్చారు. దుర్గమ్మను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

మాడుగుల రూరల్ : దుర్గాష్టమి సందర్భంగా కేజే పురం దుర్గాలమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.చిట్టినాయుడు సారధ్యంలో భవానీ భక్తులు పాల్గొన్నారు. దసరా వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

రోలుగుంట: దుర్గాష్టమి సందర్భంగా మండలంలో దుర్గాదేవికి గురువారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా కొవ్వూరులో భవానీమాలధారులు భారీ అన్నసమారాధన జరిపారు.

మాడుగుల రూరల్: దుర్గాష్టమిని పురస్కరించుకుని వంటర్లపాలెం కనకదుర్గమ్మను గురువారం దుర్గాదేవిగా అలంకరించారు. కుంకమ పూజలు నిర్వహించారు. సాయంత్రం భజన కార్యక్రమం ఏర్పాటు చేసారు. కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి అష్టలక్ష్మి కుంకుమ పూజలు జరిపారు. ఎం. కోడూరు, కె.జె. పురం, శివాలయాల్లో పార్వతిదేవికి ఉదయం, సాయంత్రం సామూహిక కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు.

మాడుగుల: మాడుగులలో వెలసిన దేవీ తల్లీ గురువారం దుర్గా అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం రాత్రి దేవీ ఆలయం వద్ద ప్రదర్శించిన సాము గరిడీలు, మహిళా కోలాటాలు ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

దుర్గమ్మ తల్లికి ప్రణమిల్లి..

చోడవరం : దసరా నవరాత్రి ఉత్సవాల్లో అష్టమి పూజలు గురువారం అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీదుర్గాదేవి అలంకరణలో దుర్గమాంబిక అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు శివ కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న బూడి దంపతులు

దేవరాపల్లి: బోయిలకింతాడలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలలో భాగంగా గురువారం నిర్వహించిన భారీ అన్నసమారాధనకు అధిక సంఖ్యలో భక్తజనం తరలివచ్చి అమ్మవారి మహా ప్రసాదాన్ని స్వీకరించారు. తొమ్మిది రకాల పిండి వంటలతో ఘనంగా ఏర్పాటు చేసిన ఈ అన్నసమారాధనను మాజీ డిప్యూటీ సిఎం, వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు వడ్డన చేసి ప్రారంభించారు. అనంతరం అమ్మవారిని బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు దర్శించుకొన్నారు. వారిని సర్పంచ్ బూరె బాబురావు, గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు.

దుర్గాదేవి సారె ఊరేగింపు



నర్సీపట్నం:మున్సిపాలిటీ గచ్చపువీధి రామాలయం వద్ద దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారి సారె ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి ప్రీతికరమైన పిండి వంటకాలతో మహిళలు సారె ఊరేగింపులో పాల్గొన్నారు.

సమష్టి బాధ్యతగా పారిశుధ్య నిర్వహణ

దేవరాపల్లి: ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేక అధికారి వి. రవీంద్రనాథ్ అన్నారు. దేవరాపల్లిలో గురువారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రజల సమష్టి భాగస్వామ్యంతోనే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుందన్నారు.

కె.కోటపాడు : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. ప్రతి శనివారం కె.కోటపాడులో ఉదయం 6 నుంచి 10 గంటల వరకూ పరిశుభ్రతా కార్యక్రమం చేపడుతున్నట్టు ఆమె తెలిపారు. గురువారం కె.కోటపాడులో జరిగిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎంపీడీవో సాంబశివరావు పాల్గొన్నారు.

50 మంది పేదలకు నిత్యావసరాల వితరణ



నిత్యావసర సరుకులను అందిస్తున్న నారాయణపాత్రుడు

కె.కోటపాడు : సత్యసాయిబాబు సూచించిన సేవామార్గాన్ని భక్తులు భక్తులు కొనసాగించాలని కె.కోటపాడు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బండారు నారాయణపాత్రుడు అన్నారు. స్థానిక కామాక్షమ్మ ఆలయం వద్ద గురువారం 50 మంది నిరుపేదలకు సత్యసాయి భక్తులు నారాయణసేవలో భాగంగా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. నెలకు సరిపడా 15 రకాలైన నిత్యావసర సరుకులను అందించినట్టు నారాయణపాత్రుడు తెలిపారు.